క్లుప్తంగా

చురుగ్గా ఓటరు సర్వే



మునగపాకలో ఓటరు సర్వే చేస్తున్న దృశ్యం

మునగపాక : మండల వ్యాప్తంగా ఓటరు సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆగస్టు 22లోగా ఓటరు సర్వే పూర్తిచేయాలన్న ఆదేశాలతో గ్రామాల్లో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదు అలాగే ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి ఇంటి యజమానులతో మాట్లాడి సవరణలు చేపడుతున్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మునగపాక 170 పోలింగ్ బూత్‌లో పీఏసీఎస్ చైర్మన్ ఆడారి సంతోష్ కుమార్ సారథ్యంలో సర్వే చురుగ్గా సాగుతుంది.

నేడు తిమ్మాపురంలో గడప గడపకు

ఎస్.రాయవరం: మండలంలో తిమ్మాపురం గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు.ఈ కార్యక్రమానికి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరు అవుతారని చెప్పారు. అధికారులందరూ సకాలంలో హాజరై అందుబాటులో ఉండాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురానికి చెందిన భవిరిశెట్టి అప్పారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఏడు లక్షల రూపాయల్ని ఎమ్మెల్యే కన్నబాబు రాజు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఇటీవల అప్పారావు భార్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయనకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, నర్మాల కుమార్, విమలనాయుడు, లాలం శ్రీను, దేశంశెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆటలు, పాటలు వంటి పోటీలను నిర్వహించారు. పతాకావిష్కరణ అనంతరం బహుమతులు అందజేయనున్నారు. మహాత్మాగాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి పతాకావిష్కరణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు పది గ్రామాల్లో నా భూమి-నా దేశం

కోటవురట్ల : నా భూమి-నా దేశం కార్యక్రమం సోమవారం మండలంలోని 10 గ్రామాలలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథ రావు తెలిపారు. రామచంద్రపురం, పందూరు, గొట్టివాడ, చౌడువాడ, రాజుపేట, కైలాసపట్నం, నీలిగుంట, బోడపాలెం, రామచంద్రపాలెం, టి.జగ్గంపేట గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించి మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటారని తెలిపారు.

కానరాని చినుకు జాడ

రాంబిల్లి: వరుణుడు మొహం చాటేశాడు. 20 రోజులుగా చినుకు రాలలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మెరక ప్రాంతాల్లో వరి నారు మడులకు తడులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దమ్ము చేసిన పొలాలు సైతం ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయితే శారద నదిలో నీరు ప్రవహించే పొలాల్లో దమ్ము, వరి నాట్లు పనులు జరుగుతున్నాయి.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలెన్నో

- పథకాలు అందాలంటే నమోదు తప్పనిసరి
- రైతుల సంక్షేమానికి ప్రామాణికం

మునగపాక : ఆరుగాలం శ్రమించే రైతులకు విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికి అందివచ్చేంత వరకు భరోసా ఉండేది కాదు. అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు కష్టాల బారిన పడుతూనే ఉంటారు. ఇటువంటి కష్టాలకు చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. సాగు విస్తీర్ణం, ఏ పంట వేశారనే వివరాలు సేకరించి ఈ-పంట నమోదు చేస్తారు.

నియోజకవర్గంలో పంటల సాగు వివరాలు ఇలా...

మండలం	పంటలసాగు (ఎకరాల్లో)
మునగపాక	10245
అచ్యుతాపురం	8245
రాంబిల్లి	17310
యలమంచిలి	7450
మొత్తం	43,250

ఈ-పంట నమోదుతో లాభాలిలా...

పంటల పెట్టుబడులకు ఉపయోగపడేలా రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం వంటి సంక్షేమ పథకాలకు ఈ-పంట నమోదు తప్పనిసరి. ఈ-పంట నమోదు చేసుకోకుంటే రైతులకు సంబంధించిన పథకాలు పొందే వీలుండదు. సెప్టెంబర్ 15 లోగా రైతులు ఈ -పంట నమోదు చేసుకోవాల్సి ఉంది.

క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణ

ఏటా ఈ-పంట నమోదుకు సంబంధించి రెండుసార్లు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తారు. గతంలో ఈ -పంట నమోదు వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు చేసేవారు. నేడు వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఆర్‌ఏలు గ్రామాల్లో రైతుల భూముల వద్దకు వెళ్లి సర్వే నంబర్లు, ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతు ఆధార్ కార్డు నంబరు అలాగే ఫోన్ నంబరును తీసుకుంటారు. ఈ వివరాలను మండల, జిల్లా స్థాయిలో అధికారులు పరిశీలించాక రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపిస్తారు.



అరబుపాలెంలో వరిసాగు



చెర్లోపాలెంలో ఈ -పంట నమోదు చేస్తున్న అధికారులు

రైతుకు అన్ని విధాలా మేలు



ఈ-పంట నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. వారు చెప్పినట్టుగానే ఈ-పంట నమోదు చేసుకుంటున్నాం. ఈ విధానం రైతులకు మేలు చేకూరేలా ఉంది. ఎటువంటి విపత్తులు ఎదురైనా ప్రభుత్వం నుంచి పరిహారం అందుకునే అవకాశం ఉంటుంది. రాయితీపై విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుకు అన్నివిధాలా మేలు జరుగుతుంది.

– వేగి కృష్ణ, రైతు, మునగపాక

సద్వినియోగం చేసుకోవాలి



ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ఈ -పంట నమోదును ప్రామాణికంగా తీసుకుంటాం. రైతులు ఏ సర్వేలో ఎటువంటి పంటలు సాగు చేస్తున్నారనే వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. రైతులు కూడా సహకరించాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

జోరందుకున్న వరి నాట్లు



యండపల్లిలో దమ్ము పడుతున్న రైతు



పెదఉప్పలం శివారులో వరినాట్లు వేస్తున్న దృశ్యం



కొరుప్రోలు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కోటవురట్ల : ఖరీఫ్ వరి నాట్లు జోరందుకున్నాయి. ప్రస్తుతం మండలంలో ఏ గ్రామంలో చూసినా దమ్ము పనులు ముమ్మరంగా సాగుతుండగా మరో పక్క వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 1680 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పనులు చేపట్టారు. ఇందుకు వ్యవసాయశాఖ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం కూడా అన్ని వనరులను రైతులకు సమకూర్చడంతో రైతులు ఉత్సాహంగా వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు దాదాపు 60 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మోటార్లు ఉన్న రైతులు వరినాట్లు పూర్తి చేస్తున్నారు.

ఎస్.రాయవరంలో మందకొడిగా...

ఎస్.రాయవరం : మండలంలో వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు పూర్తి స్థాయిలో ప్రభుత్వం సమకూర్చినప్పటికీ వర్షాలు సకాలంలో కురవక పోవడంతో అన్నదాతలు నాట్లు వేసేందుకు వెనుకాడుతున్నారు. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికి వరహానది పారుదల నెమ్మదిగా ప్రారంభం కావడంతో ముందుగా చినగుమ్ములూరు, గుర్రాజుపేట, దార్లపూడి గ్రామంలో నాట్లు పూర్తయ్యాయి. మండలంలో 8500 ఎకరాలకు పైగా వరి సాధారణ విస్తీర్ణం ఉంది. అధికంగా కొరుప్రోలు పెద ఉప్పలం, తిమ్మాపురం, సర్వసిద్ధి , సైతారుపేట గ్రామాల్లో వరి పొలాలు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 1500 వందల ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలంలో ఎక్కువగా వర్షాధారం సాగు కావడంతో వర్షాలు లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం కొరుప్రోలు, పెదఉప్పలం గ్రామాల్లో ఇప్పుడుప్పుడే వరినాట్లు ప్రారభం అయ్యాయి.

వరి నారుమళ్లకు ఊరట

ఎస్.రాయవరం: మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది.ఇటీవల వేడిని తలపించే ఎండలు కాయడంతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈక్రమంలో ఆదివారం ఎస్.రాయవరం, అడ్డురోడ్డు, కొరుప్రోలు తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.ఉక్కపోతతో ఉన్న మండల వాసులకు ఉపశమనం కలిగింది. ఈ వర్షం వరినారు మడులకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చిందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ సైనికుడికి సన్మానం



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఎర్రవరం,ఉప్పవరం గ్రామాల్లో నా దేశం – నా భూమి కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు కూనిసెట్టి రమణను సత్కరించారు. సకలా ఉమామహేశ్వర్, చిన్ని శ్రీనివాసరావు, పందల శ్రీను, సత్యారావు, పల్లె శ్రీను, అడపా మహాలక్ష్మి నాయుడు, సత్తిబాబు, ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం జరగనుంది. దేవాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఉదయం 7 గంటలలోపు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9491000713 నంబరులో సంప్రదించాలన్నారు.

23న మరిడిమాంబ అమ్మవారి పండగ

అనకాపల్లిటౌన్ : స్థానిక కోట్నివీధిలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి కోరుకొండ రాఘవ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ రాఘవ మిత్రమండలి వారి ఆధ్వర్యంలో అదేరోజు సాయంత్రం 4 గంటలకు మెగా క్రికెట్ టోర్నమెంట్ రింగ్‌రోడ్డులో జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.10 వేలు, 5వేలు, షీల్డ్ అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000113455, 9032338806 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన



శాఖా గ్రంథాలయంలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక పఠనంతో పాటు, యోగాసనాలు వేయించారు. స్టోరీ రైటింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కూండ్రపు నాయుడుబాబు, గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



నినాదాలు చేస్తున్న ముఠా కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ముఠా కార్మికుల మండల సంఘం అధ్యక్షుడు రాజన్న సత్తిబాబు కోరారు. ఈ మేరకు అచ్యుతాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈఎస్‌ఐ సదుపాయం, పీఎఫ్, పింఛను, ప్రమాద బీమా వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. రాజు, తాతారావు, వెంకన్న, వాసు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలు ప్రారంభం



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దాడి జయవీర్

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశాఖ ఉమ్మడి జిల్లాల ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వివేకానంద స్వామి యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ అంతర్ స్కేటింగ్ బాల బాలికల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 450 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో బహుమతులు గెలుపొందాలని ఆయన కోరారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యూనిక్ స్కేటింగ్ అధ్యక్షుడు బి.వి.రామకృష్ణ, కార్యదర్శి కె.రవికుమార్, చీఫ్ కోచ్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వుషు క్రీడాకారులకు బాక్సింగ్ కిట్ల పంపిణీ



వూషూ క్రీడాకారులకు బాక్సింగ్ కిట్లు అందిస్తున్న నారపిన్ని ప్రసాద్

తుమ్మపాల : మండలంలో అక్కిరెడ్డిపాలెంలో గల వుషు క్రీడాకారులకు పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్ బాక్సింగ్ కిట్లు అందించారు. అరుణ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిక్షణలో సమీప గ్రామల చిన్నారులు వూషూ శిక్షణ పొందుతున్నారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని ప్రసాద్ అభినందించారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ దువ్వాడ హరీష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ మహిళలకు అండగా ఉన్నారు..



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, అనేక సంక్షేమ పథకాలను మహిళలకే అందిస్తూ ఆర్థిక అండ కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించి సున్నా వడ్డీ నగదుపై చర్చించారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఎన్నో వనరులు అందిస్తూ ఆర్థిక స్వావలంబన పొందేందుకు తోడ్పడుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అయినా ఇలా మహిళల సంక్షేమం కోసం ఆలోచన చేసిందా అని అడిగారు. సీఎం జగన్ మీకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని, రానున్న ఎన్నికల్లో మీ ఓటుతో ఆయనకు కృతజ్ఞత తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణీ



దివ్యాంగులకు స్కూటీలను అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన 10 స్కూటీలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10వ తరగతి పాసై శారీరక అంగవైకల్యం కలిగి ద్విచక్ర వాహనాలు నడపగలిగిన వారికి అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 15 మంది దరఖాస్తు చేసుకోగా 13 మంది అర్హులుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జగదీశ్, ఎంపీడీవో కార్యాలయ ఏవో కృష్ణ, దేశంశెట్టి శంకర్‌రావు, నర్మాల కుమార్, కోన బుజ్జి, మళ్ల జయలక్ష్మి, విమలనాయుడు, లాలం శ్రీను, పిన్నమరాజు వాసు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం



వాడ్రాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన వచ్చింది.అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు గంగుపాం నాగేశ్వరరావు, గొర్ల వెంకటేశ్వరరావు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. కాగా శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు, గ్రామస్తులు మల్లయ్యనాయుడు, జోగారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెజ్ లారీ అసోసియేషన్ అధ్యక్షునిగా అడిగర్ల



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్ లారీ అసోసియేషన్ అధ్యక్షునిగా అడిగర్ల దేముడు, ఉపాధ్యక్షునిగా లాలం చిన్న, కార్యదర్శిగా ప్రగడ ప్రకాశ్‌రావు, కోశాధికారిగా నర్మాల రమణలను ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యుల్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యవర్గ సభ్యులుగా లాలం రాంబాబు, రాజాన గోపి, బీఎస్ఎన్ రాజు, గొర్లె నూకరాజు, శనివాడ శ్రీనివాసరావు, రెడ్డి మని, అప్పలనాయుడు, లాలం పైడికొండ, లాలం చిరంజీవిలను ఎనుకున్నారు.